క్లుప్తంగా

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే గ్రూప్1 పరీక్ష రద్దు



ఆర్మూర్: రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం కారణంగానే గ్రూప్ 1 పరీక్ష రద్దయిందని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని తొలగించి, బోర్డును ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నిఖిల్, సిద్ధార్థ, అనిల్, నితిన్, రణవీర్, అభిలాష్ ఉన్నారు.

అక్రమ అరెస్టులను నిలిపివేయాలి



ఆర్మూర్: మావోయిస్టుల పేరుతో ప్రజాపంథా నాయకుల అక్రమ అరెస్టులను నిలిపి వేయాలని సీపీఐ(ఎంఎల్)ప్రజా పంథా ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవరాం డిమాండ్ చేశారు. భద్రాచలం జిల్లాలో ప్రజా పంథా నాయకుడు కొండ చరణ్‌ను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం ఆర్మూర్‌లో పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి, నిరసన తెలిపారు. నాయకులు ఠాకూర్, గంగన్న, రాజన్న, దుర్గాప్రసాద్, పద్మ, లక్ష్మి ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



బోధన్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వం పెంచిన నెలసరి వేతనం, బకాయి బిల్లులు చెల్లించాలని ఎండీఎం కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు పట్టణంలో చేపట్టిన సమ్మె ఆదివారం 12వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా వారు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్మికులు పుష్ప, ఉమా, లక్ష్మి, శ్యాంరావు, ఈశ్వరి, సుభద్ర, నాగరాజ్ పాల్గొన్నారు.

బీఎస్పీ గెలుపు కోసం కృషిచేయాలి



బోధన్: బోధన్ అసెంబ్లీ స్థానం నుంచి బీఎస్పీ అభ్యర్థి బరిలో ఉంటారని, పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషిచేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి సింగాడే పాండు పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భగా ఆయన పలు అంశాలపై చర్చించారు. పార్టీ అధినేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మండలాలు ,గ్రామాల్లో పర్యటనకు రానున్నారని వెల్లడించారు. నాయకులు గంగాధర్, శంకర్, రామకృష్ణ, సుభాష్, గోపాల్, గంగాధర్, యూసుఫ్, నాగభూషణం పాల్గొన్నారు.

ఇంటింటికీ కాంగ్రెస్ ప్రచారం



బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికీ కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. నాయకులు కపిల్, రాజాలింగం తదితరులు పాల్గొన్నారు.

నియామకం



ఆర్మూర్: పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మానకొండూరు సంధ్య నియమితులయ్యారు. ఆర్మూర్‌లోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఆదివారం ఆమెకు నియామకపత్రాన్ని టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోలా వెంకటేష్, నియోజకవర్గ నాయకుడు వినయ్‌రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు నీరడి భాగ్య అందజేశారు. నాయకులు సాయిబాబాగౌడ్, రవికాంత్‌రెడ్డి, రవి, శంకర్, బాల కిషన్, బారి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చీపుర్లు పట్టి.. చెత్తను తొలగించి..

- ఊరూరా శ్రమదానం చేసిన ప్రజలు
- ప్రధాని మోదీ పిలుపు మేరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహణ



కిసాన్‌నగర్‌లో శ్రమదానంచేస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

ఆర్మూర్/బోధన్/మాక్లూర్/బోధన్‌టౌన్/బాల్కొండ/రెంజల్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని అన్ని మండలాలు, గ్రామాల్లో ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రజలు శ్రమదానం నిర్వహించారు. చీపుర్లు పట్టి పరిసరాలను శుభ్రం చేసి, చెత్తను తొలగించారు. మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈసందర్భంగా పాలకవర్గ సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞలు చేయించారు. అలాగే పలు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఆర్మూర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పారిశుధ్య కార్మికులకు సన్మానం చేశారు.



ఆర్మూర్ పట్టణంలో..



సాలూరలో..



ఆర్మూర్‌లో పారిశుధ్య కార్మికులకు సన్మానం



మాక్లూర్‌లో..



బోధన్‌లో..



రెంజల్ గ్రామంలో..

ప్రజలకు జీతగాడిలా పనిచేస్తా

ఆర్మూర్/మాక్లూర్: ప్రజల సంక్షేమం కోసం జీవితాంతం వారికి జీతగాడిలా పని చేస్తానని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంకాపూర్‌లోగల ఆయన నివాసంలో ఆదివారం వివిధ గ్రామాల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆశీస్సులతో బీఆర్‌ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి..

పెర్కిట్(ఆర్మూర్): నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూసి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆదరించాలని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కోరారు. మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో ఆదివారం నమస్తే నవనాథపురం కార్యక్రమంలో భాగంగా ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని, పరిష్కరించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు భూమిపూజలు నిర్వహించారు. సర్పంచ్ బండమీది జమున, ఉప సర్పంచ్ గంగాధర్, సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్, నాయకులు నర్సా రెడ్డి, అప్పాల సురేష్, గణేష్, భూపతి, శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.



గోవింద్‌పేటలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



అంకాపూర్‌లో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న పలు గ్రామాల ప్రజలు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మోర్తాడ్: మండలంలోని పాలెం, సుంకెట్, మోర్తాడ్‌లలో ఆదివారం మంత్రి ప్రశాంత్‌రెడ్డి పర్యటించి, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కోటపాటి నర్సింహానాయుడు, మధుశేఖర్, జెడ్పీటీసీ బద్దం రవి, సర్పంచ్‌లు భోగ ధరణి, ఏనుగు సంతోష్, కడారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

యాదవులు ఐక్యంగా ఉండాలి



మాక్లూర్‌లో మాట్లాడుతున్న యాదవ సంఘం ప్రతినిధులు

మాక్లూర్: యాదవులు ఐక్యంగా ఉండాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారాం యాదవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో ఆదివారం యాదవుల ఆత్మీయ సమ్మేళన మహాసభ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జనాభాలో 18శాతం ఉన్న యాదవులు కలిసికట్టుగా ఉన్నప్పుడే ప్రభుత్వంలో చోటు దక్కించుకోవచ్చన్నారు. రాజకీయ లబ్ధికోసం కొందరు మనలో మనకే చిచ్చులు పెట్టి విభజించు, పాలించు అనే సూత్రం ఉపయోగిస్తారని అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బాబురావు, సభ్యులు గంగాధర్, రాజన్న, మహిపాల్, కృష్ణ, లింగం, రాజమల్లు, మహేందర్, నగేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు

డొంకేశ్వర్/మాక్లూర్/బోధన్‌టౌన్/బాల్కొండ: నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించడంతో బీజేపీ నాయకులు ఆదివారం సంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో పార్టీ నాయకులు టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. అలాగే ప్రధాని మోదీ, ఎంపీ అర్వింద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.







డొంకేశ్వర్‌లో టపాసులు పేలుస్తున్న బీజేపీ నాయకులు.. బోధన్‌లో క్షీరాభిషేకం నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు.. బాల్కొండలో స్వీట్లు పంచిపెడుతున్న నేతలు

సంక్షిప్తం

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లిలో ఆదివారం సర్పంచ్ శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. గ్రామంలో అబివృద్ధి పనులకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉపసర్పంచ్ మహేష్, భూమయ్య, శ్రీనివాస్, భాస్కర్, సురేష్, జగన్, శ్రీకాంత్ ఉన్నారు.

ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌కు 14వేల దరఖాస్తులు



బోధన్: బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాకు నియోజకవర్గ పరిధిలోని యువత నుంచి 14వేల దరఖాస్తులు వచ్చాయని బీఆర్‌ఎస్ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు శంకర్‌గౌడ్ తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. దరఖాస్తుల స్వీకరణ గడువు శనివారంతో ముగిసిందన్నారు. సూర్య వెంకటేష్, ప్రవీణ్ జాదవ్, నరేష్, మహ్మద్, శివ కుమార్ పాల్గొన్నారు.

జర్నలిస్టు కాలనీలో శ్రమదానం

ఆర్మూర్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో ఆదివారం కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛ కాలనీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీవాసులు శ్రమదానం చేసి, పరిసరాలను శుభ్రం చేశారు.

చెరువుల్లో చేపపిల్లల విడుదల



డొంకేశ్వర్(ఆర్మూర్): మండలం నూత్‌పల్లి ఊర చెరువుల్లో ఆదివారం సర్పంచకూనింటి రవి రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన చేప పిల్లలను విడుదల చేశారు. భోజన్న, మధు, రామకృష్ణ, రాజేంధర్, తదితరులున్నారు.

కొనసాగిన రిలే దీక్షలు

బోధన్: పట్టణంలోని ఎన్డీఎస్ఎల్ ఫ్యాక్టరీ ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 58వ రోజు కొనసాగాయి. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

బాల్కొండలో వైద్య శిబిరం

బాల్కొండ: మండలకేంద్రంలో ఆదివారం వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు ప్రజలకు దోమల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం రక్తనమునాలను సేకరించారు. యూనిట్ అధికారి మురళి, వైద్య సిబ్బంది ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు అందజేత



వేల్పూర్: మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి బాల్కొండ నియోజకవర్గ ముస్లిం మహిళలకు మంజూరైన 300 కుట్టు మిషన్లను రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ ఆదివారం వేల్పూర్ మండలం లక్కోర వద్ద పంపిణీ చేశారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వేల్పూర్: ఆర్మూర్‌కు చెందిన సహశ్రీ అనే విద్యార్థిని ఓ ప్రమాదంలో గాయపడింది. దీంతో వైద్యం కోసం రూ. 8వేల ఆర్థిక సహాయాన్ని మండల కేంద్రానికి చెందిన చేయూత ఫౌండేషన్ సభ్యులు ఆదివారం అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, సభ్యులు దినేష్, మహిపాల్,భరత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శికి సన్మానం

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ జీసస్ లవ్స్ గాస్పల్ చర్చిలో ఆదివారం క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మాణిక్యాల ఏలియా శ్రీనివాస్‌ను సంఘ సభ్యులు సన్మానించారు. పాస్టర్ పద్మారావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ రైతులకు సన్మానం



బాల్కొండ/కమ్మర్‌పల్లి: వర్ని మండలకేంద్రంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు ఉత్తమ రైతులకు సన్మానం నిర్వహించారు. ఈసందర్భంగా బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌కు చెందిన కొండ అశోక్‌ను, కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌కు చెందిన రైతు బద్దం తిరుపతిరెడ్డికి క్లబ్ ఇంటర్‌నేషనల్ అధ్యక్షుడు బాబురావ్ అవార్డులను ప్రదానం చేశారు. క్లబ్ ప్రతినిధులు వీర లక్ష్మీ, సభ్యులు ద్యాసాగర్, చాకులింగం, శివనారాయణ ఉన్నారు.



అంగన్‌వాడీల ముందస్తు అరెస్టు



ఆర్మూర్/డొంకేశ్వర్/వర్ని/రుద్రూర్: ఆర్మూర్, బాల్కొండ, నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో ఆదివారం స్థానిక పోలీసులు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ముందస్తు అరెస్టు చేశారు. నిజామాబాద్‌లో సీఐటీయూ మహాసభ, రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ పర్యటన దృశ్య ముందస్తుగా వారిని అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఆందోళనకారులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. సాయంత్రం వ్యక్తిగత పూచీకత్తుపై వదిలివేశారు.

చలో భీమ్‌గల్‌ను విజయవంతం చేయండి



భీమ్‌గల్: పోడు భూమి పట్టాల సాధన కోసం ఈనెల 4న నిర్వహించే చలో భీమ్‌గల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ ప్రజా పంథా డివిజన్ కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి రాజేశ్వర్ కోరారు. ఈమేరకు ఆదివారం వారు రహత్‌నగర్, కారెపల్లి, దేవన్‌పల్లి, మెండోరా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అందరికి పోడు భూములకు పట్టాలు ఇవ్వని పక్షంలో వచ్చే ఎన్నికల్లో రైతులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నాయకులు నరేందర్, అరవింద్, మోహన్, శ్రీనివాస్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

ఆర్మూర్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పలువురు ముస్లిం యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ నాయకుడు పొద్దుటూరి వినయ్‌రెడ్డి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. నాయకులు కోల వెంకటేష్, సాయి బాబాగౌడ్, రవి, బట్టు శంకర్,రవి పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో వినయ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ముస్లిం నాయకులు

బీజేపీలోకి పలువురు..



బీజేపీలో చేరిన 30వ వార్డు యువకులు

బోధన్‌టౌన్: పట్టణంలోని 30వ వార్డు యువకులు ఆదివారం బీజేపీలో చేరారు. వారికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డిలు బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు శ్రీధర్, సుధాకర్‌చారీ, రాం చరణ్ యాదవ్, బాలరాజు, వాసు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..



ఘనంగా గ్రామ దేవతల పండుగ

వర్ని: మోస్రా మండలంలోని గోవూరు, చందూర్ గ్రామాల్లో ఆదివారం గ్రామదేవతల పండుగను గ్రామ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవార్లకు సమర్పించారు అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.

ఒకే పనికి రెండు శిలాఫలకాలా?



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కమ్మర్‌పల్లి: ఒకే పనికి రెండు శిలఫలకాలా అని హాసకొత్తూర్ కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. గ్రామంలో 2014లో, ఇటీవల గిడ్డంగి నిర్మాణానికి వేసిన శిలఫలకాన్ని కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. 2014లో రూ. 5 లక్షలతో గిడ్డంగి నిర్మాణానికి అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారని, అట్టి నిర్మాణం పిల్లర్లకే పరిమితమైందన్నారు. ప్రస్తుతం అదే గిడ్డంగి నిర్మాణం కోసం ఐదు రోజుల క్రితం రూ. 6లక్షలతో గిడ్డంగి నిర్మాణానికి శంకుస్థాపన చేసి మోసగించారని ఆరోపించారు. అబద్ధపు హామీలతో మోసగించకుండా ఇచ్చిన హామీలను నెరవేర్చి మంత్రి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని హితవు పలికారు. నాయకులు రవి, ప్రవీణ్‌రెడ్డి, గంగాధర్,లింగారెడ్డి, గంగాధర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.